# కిల్లింగ్ మెర్సీ

**సుగుణ**

'మెర్సీ! అర్ఫనేజ్ పని మీద ఊటీ వస్తున్నాను. వారం వుంటాను. గెస్ట్ హౌజ్‌లో మకాం ఎరేంజ్ చేసారు. వచ్చి కలుస్తాను. ఏఁవిటి ప్రెజెంట్ సంగతులు?'' అన్నాను.

''ఎన్నాళ్లయింది నీ వాయిస్ విని సుమధురా! సంగతులేముంటాయి? ఎప్పటివే. అత్తగారి సేవ, తోట చూసుకోవడం, పనివాళ్లతో తంటాలు పడటం- ఇవే. జనవరిలో కెన్నీ రిటైర్ అయిపోయాడు. ఇప్పుడు ఇంటిపట్టునే వుంటున్నాడు. కారు కొనుక్కున్నాం. ఎక్కడికైనా సరదాగా తిరిగొద్దాం అంటే అత్తమ్మని చూసుకోవడానికి ఇరవైనాలుగ్గంటలు చాలవు.



AKBAR

'ఎంతసేపూ చేపల పులుసూ, చికెన్ కర్రీ, ఐస్‌క్రీమూ, రాగిజావ, ఒకటేమిటి, ఎక్కడలేనివీ వండి పెట్టాలి. అన్నీ రుచిగా వుండాలి. కాస్త తేడా కూడా పనికిరాదు. బతుకంతా ఈవిడకే అంకితమయిపోతోంది. నువ్వు చూడు! ఎంత చక్కగా ఛారిటి పనులు చేస్తున్నావో? నీ ఆర్ఫనేజెస్ అన్నీ చూడాలని వుంటుంది. నీతో మాట్లాడి, బోలెడు కబుర్లు చెప్పుకోవాలని వుంటుంది. కానీ, ఈ మదర్ ఇన్ లా పడనీయదే! మనం ఒక్క నిముషం కలిసి కూర్చుంటే సహించ లేదు. అది కావాలీ, ఇది అందియ్యి, అని పిలుస్తూనే వుంటుంది. క్రితంసారి చూసావుగా. సరేలే! నీ ఫోన్ బిల్లు పెరిగిపోతోంది. అదుగో! అప్పుడే మాన్‌స్టర్ ఇన్ లా పిలుస్తోంది. పెట్టేస్తాను. నువ్వొచ్చినప్పుడు మాట్లాడుకుందాం.'' మెర్సీ హడావిగా ఫోన్ పెట్టేసింది.

మెర్సీ నా చిన్ననాటి స్నేహితురాలు. మా యిళ్లు పక్కపక్కనే వుండేవి. మా యింటి చుట్టూ పెద్ద తోటుండేది. అటూ, ఇటూ. పరుగులు పెడుతూ తెగ ఆడుకునేవాళ్లం. మెర్సీ వాళ్లిల్లు చిన్నది. మట్టి జాగా వుండేది కాదు. తనకి పూల మొక్కలంటే సరదా. మా తోటలో ఒకవైపు గులాబీలుండేవి. బెంగుళూరు నుంచి తెప్పించి స్పెషల్‌గా నాన్న నాటించారు. ఇక మెర్సీ వాటిని ఒక్క నిముషం వదిలేది కాదు. స్కూల్నించి రాగానే మా యింటికి పరిగెట్టుకుని వచ్చేసేది. ఆ గులాబీ మెక్కలు ఎంత ఎదిగాయెూ రోజూ కనిపెట్టడమే! సాయంత్రం చీకటి పడేవరకూ వాటి దగ్గరే తచ్చాడి, నీళ్లుపోసి, వడిలిన ఆకులు తుంచి, ఏదేదో చేసేది. అవి ఫైనల్‌గా అరచేతి సైజులో రంగురంగుల పూలు పూసేసరికి మెర్సీ సంబరం అంతా ఇంతా కాదు. పెంచడానికి ఎంత శ్రమ పడిందో, అంతకు రెట్టింపు వాటిని రాలుగాయి పిల్లల్నించి కాపాడ్డానికి పడేది. ఎవరు గోడదూకి కోసుకుని వెళ్లిపోతారోనని నిత్యం బెంగపెట్టుకునేది. పూలు విచ్చిన తర్వాత రేకులు రాలిపోయేదాకా మెర్సీకి వాటితోనే కాలక్షేపం.

కెన్నెత్‌ని పెళ్లి చేసుకుని వూటీ వెళ్లిపోతూ పూల మెక్కలని వదల్లేక పోయింది. అంత ఎటాచ్‌మెంట్ వాటితో.

''వూటీలో పెద్ద తోట పెంచుకో. యూ హ్యావ్ ఎ గ్రీన్ థంబ్'', అన్నారు నాన్న. ఆ మాట విని మురిసి పోయింది. అలాగే కెన్నీ పెద్ద ఇల్లు కట్టుకుని మెర్సీ అభిరుచికి సరిపడా బోలెడు పూల మొక్కలు నాటించాడు. మెర్సీకి తోటంటే ప్రాణం.

భర్త చనిపోయాక కెన్నీ తల్లికి బోలెడు ఆస్తి సంక్రమించింది. దాన్ని ఫిక్సెడ్ డిపాజిట్స్ కింద మార్చి తనపేరున దాచుకుంది. కెన్నీ ఒక్కడే కొడుకు. ఇల్లు కట్టుకుంటున్నప్పుడు తన డబ్బుతో సెపరేట్‌గా గది, సదుపాయాలతో కట్టించమంది. అలాగే కట్టించాడు కెన్నీ. ఆ తర్వాత ఒక్కపైసా ఇవ్వలేదు. 'ఇదుగో, అదుగో' అంటూ తాత్సారం చేసి ఇన్నేళ్లూ గడిపేసింది. కెన్నీ రిటైర్ అయిపోయినా డబ్బు ఇవ్వలేదు. ఆవిడ పేరుకు దయామయి. దయా, దానగుణాలు ఏ కోశానా లేవు. నేను విజిట్‌కి వెళ్లినప్పుడల్లా', ఏమ్మా! మధురం! నువ్వు ఎంత ఛారిటీ వర్క్ చేస్తున్నావు! మా క్రిస్టియన్స్‌ని మించిపోయావు. నీ అనాథాశ్రమానికి డొనేషనివ్వాలని వుంటుంది. ఏదీ! నా కొడుక్కి బాకీ పడిపోయాను. లేకపోతే నీకే అంతా ఇచ్చేసే దాన్ని'' అంటుంది. విని నవ్వుకుంటాను. మెర్సీ వంటింట్లో గిన్నెలు కాస్త ఎక్కువగా శబ్దం చేస్తుంది, కోపం ఇంకెలా ప్రదర్శించాలో తెలియక.

ఇన్నేళ్లుగా ఇదే తంతు. గత సంవత్సరం నాన్న పేరున ఎనిమిదో ఆర్ఫనేజ్ ఊటీలో కట్టించాలని నిర్ణయించింది ట్రస్ట్ బాడీ అందుకే ఈ విజిట్.

''ఆ రాళ్లూ రప్పల్లో ఎంతసేపు కూర్చుంటావు? తర్వాత ఒంటరిగా గెస్ట్‌హౌస్‌లోనూ! ఇక్కడికొచ్చేయ్ మధురా: నువ్వెక్కడికెళ్లాలన్నా కెన్నీ తీసుకెళ్తాడు లే. కారు కొంచెమ్మైనా నడపకపోతే బ్యాటరీ ఛార్జ్ అవదు. రాత్రి వచ్చేయ్!'' అని ఆర్డరు జారీ




చేసింది మెర్సీ. నాకూ అదే మనసులోవుంది. ఫోన్లో ఎంతకని మాట్లాడుకుంటాం? సరేనని సూట్‌కేస్ సర్దేసుకుని రెడీ అయిపోయాను. సాయంత్రం కెన్నీ వచ్చి వాళ్లింటికి రవాణా చేసాడు.

''ఎలా వున్నారు దయామయిగారూ?'' అన్నాను వెళ్లగానే. మెర్సీకి నేను ఆవిడని పలకరించకపోతే భయం, ఏమనుకుంటుందోనని. మెర్సీని తృప్తి పర చడానికి ఆపని చేస్తాను కానీ, నాకావిడతో ఏ ఇంట రాక్షసనూ నచ్చదు. అమ్మా, ఆంటీ, ఇలా పర్సనలైజ్ గానూ పిలవాలనిపించదు. పేరుతోటే!

''ఏదో ఇలా వున్నానమ్మా? లేచి తిరగ్గలుగుతు న్నాను. జీసస్ ఇంకా పిలవడం లేదు. చనిపోయే నాటికి మీ నాన్నగారి వయసెంత తల్లీ?'' అందావిడ గొంతులో నీరసం నింపుకుని. 'పుట్-ఆన్' అని నా కర్థమవుతూనే వుంది.

''అరవై తొమ్మిదండీ. డెబ్బై రాకుండానే పోయారు. పుట్టిన రోజు ఘనంగా చేద్దామనుకుం టున్నాం. ఇంతలోనే మరణం చెందారు. ప్రతి యేడాదీ అందుకే అనాథాశ్రమాల్లో పెద్ద యెత్తున సెలబ్రేట్ చేస్తారు పిల్లలంతా'', అన్నాను.

''ఎంత అదృష్టం? నాకు ఎనభైతొమ్మిది. ఇంకో వారమే తొంభైయవ పుట్టిన రోజుకి. నా కొడుకు పార్టీ ఇస్తానంటున్నాడు. నువ్వు కూడా వుండు. సర దాగా సెలబ్రేట్ చేసుకుందాం. మెర్సీ కేక్ చాలా బాగా చేస్తుంది,'' అందావిడ

''సరే! సరే! మధురగారిని లోనికి రానియ్యి తర్వాత అవన్నీ మాట్లాడుకోవచ్చు,'' అన్నాడు కెన్నీ, సూట్ కేస్ బెడ్‌రూంలో పెడుతూ.

''అసలు పుట్టినరోజే మర్చిపోయాం. ఎవరికుం టుంది ఓపిక మధురా, ఈ వేడుకలకి?'' అంది మెర్సీ గదిలో దుప్పటి సరిచేస్తూ. ముఖంలో అల సట స్పష్టంగా కనిపించింది.

''సరేలే! ఆవిడ సంగతెందుకు కానీ, ఇదుగో! నీ కోసం ఒక సెక్సీ డిజైనర్ నైటీ తెచ్చాను. రాత్రి వేసు కుంటావో, పగలేసుకుంటావో నీ యిష్టం. ఇప్పుడు కెన్నీ ఇంట్లోనే వున్నాడుగా- 'డేయీ' అని పేరు మార్చి వేసుకో. పన్లు బాగా అవుతాయి,'' అన్నాను వైలెట్ షిఫాన్ నైట్‌గౌన్ తీసిస్తూ.

మెర్సీ సంతోషంగా అందుకుంది. అంతలోనే ముఖం వేలాడబడి పోయింది. 'ఏమిటో! మధురా! మామూలు తిండీ, నిద్రలకే టైము సరిపోవడం లేదు. ఈ ఎక్స్‌ట్రాస్‌కి ఏం వుంటుంది? పద! డిన్నరు తిందువు గాని, ఈలోగా అత్తమ్మకి భోజనం పెడ తాను,'' అని మెర్సీ గదిలోంచి బయటకెళ్లిపోయింది.

''ఇదేమిటమ్మా మెర్సీ! మాంసం కూరా ఏమిటి? నాకోసం మెత్తగా వండావా? దుమ్ముల చుట్టూ వున్న మాంసం నాకిష్టం.... కెన్నీకి తెలిసి తెచ్చుంటాడు. ఏదీ! ఇంకో రెండు ముక్కలెయ్యి. డాక్టరు తినొచ్చన్నాడా? ఓసారి ఫోన్ చేసిరా! ఎందు కైనా మంచిది'' అంది దయామయి. కుర్చీ లాక్కుని, నాతో కలిసి భోంచేద్దామని కూర్చోబో తున్న మెర్సీ లేచింది, ఫోన్ చెయ్యడానికి.


''ఏంవీ అక్కర్లేదు. తిను! అన్నీ అరుగుతాయి. నీకే జబ్బూ లేదు. మెర్సీ! మీ ఫ్రెండు కేం కావాలో చూడు,'' అన్నాడు కెన్నీ విసుక్కుంటూ. మేమంతా తిని లేచినా, ఆవిడ ఇంకా కూర్చుని, ఆ దుమ్మూ, ఈ బోనూ చప్పరిస్తూనే వుంది.

''చూడు! చూడు! ఆవిడకి పెట్టకుండా దాచేసి, నీకేవో స్పెషల్స్ పెట్టేస్తానని అనుమానం.'' అంది మెర్సీ నాతో గుసగుసగా. వక్కపొడి నములుతూ కూర్చున్నాను.

''అదేమిటి వక్కపొడి వేసేసుకున్నారు. మామిడి పండు తినలేదా?'' అన్నాడు కెన్నీ.

''చచ్చాం! మామిడిపండు సంగతి మర్చిపో యాను. అసలీవిడ ఏదైనా తోచనిస్తేగా,'' అంటు మెర్సీ లేచి మామిడిపండు ముక్కలు కోసి ప్లేట్లో పెట్టింది,'' తినండి, అత్తమ్మా! బంగినపల్లి మీకిష్టం ''డజను మూడొందలు. ఆవిడకిష్టమని కెన్నీ చేత తెప్పించాను. ఏమిటో మధురా! పెద్దది! అనీ, ఇవీ, తినాలని ఏదో భ్రాంతి. ఆవిడ కాకపోతే నాకు మటుకె వరున్నారు చెప్పు. అమ్మ ఎలాగూ తీసుకుని, తీసు కుని, కేన్సరుతో పోయింది. ఆఖరి చూపులు కూడా దక్కలేదు నాకు. అన్నయ్య దగ్గరే వుంది చివరి దాకా. ఈవిడ కయినా చేసి పెట్టగలుగుతున్నాను. ఈ మాత్రం శక్తి నాకిచ్చినందుకు ఐ థ్యాంక్ ది లార్డ్!'' అంది మెర్సీ.

నేను మౌనంగా కూర్చున్నాను. దయామయి మామిడిపండు తినడం పూర్తి చేసి, చేతులూ, మూతీ తుడుచుకుని, మా వద్ద కూర్చుంది. ''నీ ఫ్రెండు చాలా రుచిగా వండుతుందమ్మా, మధురా! వాళ్లమ్మ పోలికే. అసలు గ్రేస్‌ని ఇక్కడే వుండ మన్నాను. వంట చేస్తూ మా దగ్గరే వుండేది. కొడుకూ, కోడలూ, అని వాళ్లకే అన్నీ చేసి పెట్టేది. వున్న కాసిని నగలూ కోడలుకే ఇచ్చేసినట్లుంది. శవం మీద ఒక్క నగ కనిపించలేదుట. మేరీ చెప్పింది'' అంది చనిపోయే ముందు మెర్సీ వాళ్లమ్మ నగలన్నీ తీసి, కొడుకు జాన్‌కిచ్చి, మెర్సీకి ఒప్ప చెప్ప మంది... మెర్సీ అన్నయ్యకి కానీ, వదినకి కాని వాటిమీద ఎటువంటి వ్యామోహమూ లేదు. మెర్సీ ఇల్లు కట్టుకునే సందర్భంలో డబ్బు అవసరమయితే అవి అమ్మి, ఆ సొమ్ము మెర్సీకి ఇచ్చేసాడు జానన్న. ఆ సంగతి నాకు తెలుసు. హైదరాబాదు నుంచి ఆ సొమ్ము మెర్సీకి అందజేసింది నేనే. ఈ దయామ



యికి ఆ సంగతి తెలియక ఏదో వాగుతూ వుంటుంది. ఈసారి ఒళ్లు మండి, నిజం చెప్పేద్దామని నోరు తెరవబోతూంటే, మెర్సీ,' రా, రా, కాసేపు డాబా మీద కూర్చుందాం,' అని నా చెయ్యి పట్టుకు లాక్కెళ్లి పోయింది.

''ఏమిటి మెర్సీ! ఆవిడ చెత్త వాగుడంతా వింటూ కూర్చోనా? అసలు సంగతెందుకు రివీల్ చెయ్యవు?'' అన్నాను కోపంగా. ''ఎందుకులే మధురా! మా అమ్మ ఈ విషయం ఎవరికీ తెలియనివ్వద్దని జానన్న దగ్గర ప్రామిస్ తీసుకుంది. ఈవిడకి చెప్పినా ప్రయోజనం వుండదు. అర్థం చేసుకునే కెపాసిటీ లేదు'', అంది.

చనిపోయిన తల్లి ప్రేమ గురించి మెర్సీ చాలాసేపు అవీ, ఇవీ చెప్తూ వుండిపోయింది. తన చేయి నా చేతిలోకి తీసుకుని వింటూ కూర్చున్నాను. చుక్కలు పొడిచాయి. నా చేతి మీద మెర్సీ కన్నీటి చుక్కలూపడుతూనే వున్నాయి రాత్రంతా.

మర్నాడుదయం కాఫీ తాగుతూ గార్డెన్ అందం చూస్తున్నాను. మెర్సీ కూడా టీ తాగుతూ గులాబీ మొక్కల పెంపకం గురించి మాట్లాడుతోంది.

''మీ యింట్లో గులాబీల్లా ఇవి పూయటం లేదు, మధురా! రేకలు సమానంగా వుండవు. పువ్వు విచ్చితే అందమే వుండదు. ఏదో పురుగు పట్టిందనుకుంటాను. మందు వెయ్యాలేమో...'' అంది. ఇంకా నేనేదో చెప్పబోతోంటే దయామయి 'మెర్సీ! మెర్సీ!' అని కేకలు పెట్టడం మొదలెట్టింది. మెర్సీ ఒక్కవుదుటున లేచి లోపలికి పరిగెట్టింది. నేను సాలోచనగా గులాబీలని చూసాను.

ఆర్ఫనేజ్ పన్లు కాస్త ఆలస్యమవడంతో నా స్టే పొడిగించాల్సి వచ్చింది. గెస్ట్ హౌస్‌కి మారిపోతానంటే మెర్సీ ససేమిరా అంది. ఇద్దరం వంటింట్లో సరదాగా కబుర్లు చెప్పుకుంటూ, ఏవేవో స్పెషల్స్ తయారు చేసేవాళ్లం. కొన్ని గట్టి పదార్థాలు మెర్సీ తిరిగి వుడికించేది, దయామయి కోసం. ప్రతి నిముషం ఆవిడ ధ్యాసే. ఎంత చేసినా ఆవిడ వంక లెంచుతూనే వుండేది. కోడు గుడ్డుకి ఈకలు పీకే రకం!

నేనూ వున్నానని దయమయి పుట్టిన రోజుకి పార్టీ ఇచ్చాడు కెన్నీ. ముందు రోజంతా నానా ఫైరానా పడి మెర్సీ 'ద ఇర్రెసిస్టబుల్ చాక్లెట్ కేక్' అని రెసిపీ ఫాలో అయి బ్రహ్మాండమైన కేక్ తయారు చేసింది. వచ్చిన అతిథులంతా తెగమెచ్చుకున్నారు. దయమయి అదే పనిగా కేకుతింది. ఈసారి కెన్నీ కూడా వార్న్ చేసాడు, ''ఈజీ! ఈజీ!'' అంటూ, ''నువ్వేగా నాకేం కాదని చెప్పావు, ఫర్వాలేదులే,' అంటూ దయామయి ఓ ఏడెనిమిది పీసెస్ లాగించేసింది.

పార్టీ అయి అతిథులంతా వెళ్లిపోయాక, మెర్సీ వేలబడిపోయింది. ఏవేవో తిని వున్నాం కనుక ఎవరికీ డిన్నరు తినాలనిపించలేదు. పక్కల మీదకి చేరి పోదాం అనుకునే సమయంలో దయామయి 'ఏమ్మా మెర్సీ! కేకుందా, అయిపోయిందా?'' అంది.

''వుందత్తమ్మా. రేపు చర్చిలో అనాథ పిల్లలకి ద్దామని అట్టే పెట్టాను'' అంది మెర్సీ కళ్లు మూసుకుపోతోంటే.

''ఏంటి! ఎంత కేకు తింటావు?'' అని కెన్నీ గసిరాడు.

''అబ్బే! వూరికే అడిగాను'', అని దయామయి కంగారుగా గదిలోకి వెళ్లిపోయింది.

మర్నాడుదయం దయామయి గదిలో నిర్జీవంగా పడుంది. డాక్టర్లు 'డెడ్' అని సర్టిఫై చేసారు. అందరం బాధపడ్డాం. ''తిండి వికటించింది'' అన్నారంతా. ''తొంభైయ్యేళ్లు బతికింది, ఫుల్ లైఫ్'' అన్నారింకొందరు. క్రిమేషన్ అయ్యేదాకా వుండి, నా పన్లూ పూర్తవడంతో హైదరాబాదు రిటర్నయిపోయాను.

రెండు నెల్లయాక మెర్సీ వుత్తరం రాసింది. దాంతోపాటు అయిదు లక్షల చెక్కు ఆర్ఫనేజ్‌కి డొనేషన్‌గా పంపింది.

''మధురా!

అత్తమ్మకి బతికున్నన్నాళ్లూ సేవ చేయగలిగాను. అమ్మకి చేయలేకపోయినా, ఈవిడనైనా కంఫర్టబుల్‌గా వుంచగలిగాను. పెద్దవాళ్ల రుణం తీర్చుకునే అవకాశం అరుదుగా లభిస్తుంది. ఆవిడ ఫిక్సెడ్‌లో వేసుకున్న అయిదు లక్షలూ నీ ఆర్ఫనేజ్‌కి పంపుతున్నాను. నేనూ, కెన్నీ ఆస్ట్రేలియా వెళ్తున్నాం. తిరిగి వచ్చాక నీతో మాట్లాడుతా. ఈసారి నువ్వొచ్చి రెండు, మూడు నెలలుండు. బోలెడు కబుర్లు చెప్పుకుందాం''

నీ

మెర్సీ.

మెర్సీకున్న 'మెర్సిఫుల్ నెస్‌లో' వీసమెత్తయినా ఆ 'అత్తమ్మ'కి వుండుంటే బాగుండుననిపించింది, వుత్తరం చదివాక.

ఊటీనుంచి తెచ్చిన ట్రావెల్ బ్యాగ్ అలాగే వుంది. జిప్ ఓపెన్ చేసి, తెల్లటి ద్రవం వున్న సీసా పైకి తీసాను. మా గార్డెన్‌లో రోజెస్‌కి వేసే పురుగుల మందు! ఇన్‌స్టెంట్ ఎఫెక్ట్! ఆ రోజు రాత్రి అంతా నిద్రపోయాక, చప్పుడు చేయకుండా కిచెన్‌లోకి వెళ్లి కేక్‌లోంచి ఒక పెద్ద స్లయిస్ కోసి, ఐసింగ్ మీద మందు పోసా. దయామయి గదిలోకి వెళ్లి, ఆవిడ్ని తట్టి లేపా.

''ఎవరూ!'' అంటూ లేచికూర్చుంది.

''మీ కోసం కేకు ముక్క తెచ్చాను. గప్‌చుప్‌గా తినేయండి,'' అన్నాను. ఆవిడ ఆబగా తినేసింది. నా నైటీతో ఆవిడ మూతి తుడిచేసి, తలగడ సరిచేసి, నా గదిలోకి వచ్చేసా.

మెర్సీ రోజెస్‌కి వేద్దామని తీసికెళ్లిన పురుగుల మందుని ఆ విధంగా వుపయోగించగలిగాను. మెర్సీ వాళ్లత్తమ్మ మీద ఎక్సెస్ 'మెర్సీ' చూపిస్తోందనిపించింది. ఆ 'మెర్సీ'ని కిల్ చేయాలని నిర్ణయించుకున్నాను. పనయింది!!!


ఇప్పుడు మెర్సీ గార్డెన్‌లో రోజెస్ తనిచ్చే ప్రేమతో చక్కగా వికసిస్తాయి.

*


THE BEST RETAILER AWARD 2007-2008 CMAI

పురుషులకై

ప్రతి రోజు సరికొత్త ఫ్యాషన్లు



CHERMA'S®

365 రోజులూ మీ డబ్బుకు ఖచ్చితమైన విలువనిచ్చే సకుటుంబ రెడీమేడ్ గార్మెంట్ షాపు